# పెండ్లిచూపులు

నాకళ్ళను నేనే నమ్మలేనివాడల్లే మానాన్న వ్రాసిన ఉత్తరం తిరిగి చదివాను. ఇంకా పొరపాటెందుకూ? నా ఇష్టం వచ్చినప్పుడు పెళ్ళి చేసుకొని వస్తానన్న మానాన్న నన్ను సంవత్సరాది లోపల వివాహం చేసుకోమంటున్నాడు.

ఇట్లాగే ఉంటుంది జీవితం. వాళ్ళూ వాళ్ళూ శారదను చూసి హడలిపోయి, బెదిరిన కుందేళ్ళల్లే తరతరలాడి, అయిదేళ్ళ పిల్లలకూ మూడేళ్ళ పిల్లలకూ అందిన కుర్రవాళ్ళకిచ్చి ముడిపెట్టేస్తుంటే చూసి, ప్రేక్షకుడి హోదాలో ఉండి నవ్విన నేనూ ఆమూకలో ఒక్కణ్ణి కావడమా? లేక అపర శ్రీరామచంద్రుడు అనిపించుకున్న నేను ఇవ్వాళ మానాన్నమాట కెదురుచెప్పనా?

మానాన్న, పాపం, ధర్మరాజు. అమిత అమాయకుడు. శారదా బిల్లు నా ఒక్కడికోసమే రాలేదుగదా! నలుగురు ఏంచేస్తే నేనూ అదే చెయ్యవచ్చుగా!

ఆయనకది తోచదు. ఒకవేళ తోచినా ఎవరైనా భయపెడితే భయపడిపోతాడు. నేను ముఖాముఖిని మాట్లాడితే నచ్చచెప్పటానికవకాశం ఉంది. కాని ముంచుకొచ్చే పరీక్షలే చూడనా, ఏలూరువెళ్ళి ఆయనతో నచ్చచెప్పి మళ్ళీ ఎవరైనా ఆయన మనస్సు తిప్పెయ్యకుండా ఆయనకు కాపలాయే కాయనా?

ఇంతకూ ఈ శ్రీధర నాగభూషణం ఎవడు? ఎక్కడ కాకినాడ, ఎక్కడ ఏలూరు, ఎక్కడి నేను? ఆయన నాకోసం ఇంతదూరం నాలో ఏం చూసి వచ్చినట్టు? అయిదు వేలు-కట్నాలూ కానుకలూ మొదలైనవాటి కింద!........ వరులు ఆయన ఇంటిచుట్టూ తిరణాల జనం మాదిరిగా తిరక్కపోయినారు. పేపర్లో ఎడ్వర్టైజు చేస్తే? ఆయన ఇంతదూరం రావాలా? ఇందులో ఏదో కిటుకుందని అనుకోటానికి అపరాధపరిశోధకుడు కావాలా? ఏ అమాయకుడికైనా అనుమానం కలుగుతుంది – పాపం, మా నాన్నకు తప్ప!

కిటుకుమాత్రం ఏముంటుంది లెండి! పిల్ల అనాకారి కోతి కావటమో, రజస్వల అయి ఉండటమో – అటువంటిదేదో అయి ఉంటుంది. మరి మానాన్న నన్ను వెళ్ళి పిల్లను చూసి రమ్మంటున్నాడుగా! పిల్లను చూస్తే వెంటనే సమ్మతిస్తామని నాగభూషణం చాలా ధైర్యంగా చెప్పాట్ట. తప్పకుండా రజస్వల అయి ఉంటుంది, లేదా ఆ పిల్లను గురించి – అటువంటివి అంద రెరుగుదురుగా! మొగుడు శోభనం కాగానే చస్తాదనీ – అటువంటివి!

ఏమైనా, నా కటువంటి వాటిలో నమ్మకం లేదు. రజస్వల అయినా నా కభ్యంతరం లేదనుకోండి. కాని పిల్ల అట్లా తోస్తే మా నాన్నకు ఒక్క కార్డు గీకి పారేశానంటే పెళ్ళి ప్రయత్నం మానేస్తాడు.

అయిదువేలు కట్నం ఎట్లాగూ అబద్ధమే అయి ఉంటుంది. పదివేలని పది చేతులో పెట్టినా మా నాన్న నోరు మెదిపేవాడు కాడు. ఆ సంగతి తెలుసుకుని ఉండాలి నాగభూషణం.

మొత్తం మీద మనిషి చర్య చాలా అనుమానాస్పదంగానే ఉంది....

తీరా ఏమీ లేకపోవచ్చును!....

నేను ఇప్పుడూహించ లేని తిరుగు దేదైనా ఉండవచ్చును. కాని! అక్కడిదాకా వెళ్ళిన తరవాత కళ్ళూ చెవులూ తెరుచుకుని ఉంటే సాధ్యమైనంత వరకు కనుక్కోక పోతానూ?

తొందర పడకుండా మరికొంతసే పాలోచించిన మీదట ఇదే మంచిదని తోచింది. కాకినాడ వెళ్ళటమూ. నాగభూషణం ఎత్తేమిటో కనిపెట్టటమూ, మా

నాన్నకు "ఇది ఇట్లాగూ, కనక ఈ సంబంధం చల్లగా జారవిడు!" మని రాసెయ్యటమూ! బస్.

ఈ తీర్మానానికి వచ్చిన తరవాత నాకు దివ్యమైన ఆలోచన తట్టింది. ఏమయినా చెప్పండి, చదివిన చదువెప్పుడూ వృథాపోదు. నేను చదివిన పాశ్చాత్య నవలా రాజాలు ఈనాటికి నాకు ఉపయోగానికి వచ్చి నాకు తట్టిన ఆలోచన ఏమిటంటే— నేను నేనుగా వెళ్ళేకంటే మరొకడుగా వెళ్ళితే?.... ఏమంటారా? సాక్షాత్తూ వరుడే పిల్లను చూడటానికి వస్తున్నాడంటే ఎట్లాగైనా నాగభూషణం జాగ్రత్తతో ఉంటాడు. నా పని సిద్ధన్న రానూ వచ్చాడు వెళ్ళనూ వెళ్ళాడన్నట్టవుతుంది. కొంచెం దూరాలోచన కలవాడు "వచ్చావా? రా, నాయనా! ఇదుగో ఇదీ తిరుగుడు!" అన్నట్టుగా నా ముందు బయట పడిపోతాడా? ఏం దాచి పెట్టాలో తెలిసినవాడు నాగభూషణం, ఎక్కడ చూడాలో తెలియనివాణ్ణి నేనూ! కనక నేను మారుపేరు పెట్టుకు వెళ్ళటం తప్పని సరి. ఎవడో వచ్చాడంటే ఎట్లాగైనా వాళ్ళు ఏమరుపాటున నాకు దొరికి పోవటానికి అవకాశం ఉంది. అప్పటికీ నేనేమీ కనిపెట్టలేక పోతానూ? అప్పుడు నా తప్పేమీ ఉండదు. కాకపోతే పెళ్ళి తప్పించటానికి ఏదో లేనిపోని కారణం ఏదైనా సృష్టించవలసి వస్తుందేమో!

"మా నాన్న నాకు ఉత్తరం రాశాడు. నేను ఇక్కణ్ణించి కదలటం అసంభవం. ఫలాని శుక్రవారం నాలుగు గంటల బండిలో నా స్నేహితుడు శివరామయ్య కాకినాడలో దిగి పిల్లను చూస్తాడు. వాడి సమ్మతే నా సమ్మతి." అని నాగభూషణంగారి కొక ఉత్తరం రాశాను.

ఆ ఉత్తరం పోస్టులో వెయ్యగానే నాకు ముచ్చెమటలు ప్రారంభమైనై. నిషామీద కుప్పిగంతులు వేస్తుండగా అకస్మాత్తుగా నిషా దిగిపోతే ఎట్లా ఉంటుందో నా సంగతి అట్లా అయింది. ఒక లక్ష సందేహాలు నన్నావరించుకున్నై. నా ఫోటో నాగభూషణంగారు చూసి ఉంటే? (పదిహేనేళ్ళ క్రితం తీయించిన దనుకోండి) ఆయన కెవరైనా నన్ను వర్ణించి ఉంటే? నాకు తెలియకుండా కాలేజికి వచ్చి ఆయన దూరాన్నించి నన్ను చూసిపోయి ఉంటే? గట్టిగా దవడ కొరుక్కున్నా. అనుమానాలు రావటం మానలేదు. ఆయన ఇంట్లో నన్నెరిగినవా రెవరైనా తటస్థపడి "ఏంరో, కృష్ణా!" అంటే?.... నిజంగా ఈ సంబంధం కలిసి నేనే పెళ్ళికొడుకు నంటూ బయట పడాలి సొచ్చినప్పుడు నన్ను, చూసి వాళ్ళంతా ఏమను కుంటారు? వెధవ్వి నవలల్లో జరగాలిసిన పన్లు జీవితంలో చెయ్యాడ మేమిటి?

ఆ సాయంత్రమే ఒక చిత్రం జరక్కపోతే నేనేదో విధంగా ఆత్మహత్య చేసుకునే ఆలోచనల్లోనే ఉండే వాణ్ణి!

దేవుడల్లే మా సూర్యం గాడు నా దగ్గిరికి ఎనర్జీ నోట్సున్నయ్యా అంటూ వచ్చాడు. వాణ్ణి కూచోబెట్టి "ఏం రా, మీది మొదటినించీ కాకినాడేనా?" అన్నా.

"కాకపోతే ఏం? నేను ఆ వూరును గురించి ఏం కావాలన్నా చెబుతాను. రానీ!" అన్నాడు.

"ఎస్. నాగభూషణం. ఎవరాయన?"

"ఏ? యస్. నాగభూషణం యస్. నాగభూషణం కాదుగద!"

"నీకు వాణ్ణి గురించి తెలిసిందంతా చెప్పకురా!"

"వాడేమిటి, డామ్ స్కౌండ్రల్! వాడి పేరు వింటే పంచమహాపాతకాలు చుట్టుకుంటై."

"పంచమహాపాతకాలే! స్కౌండ్రలా?"

"వాడేమిటి?, తలలు మార్చేస్తాడ్రా! వాడికి ప్రాక్టీసేమిటుంది? వెధవ ప్రాక్టీస్! పై సంపాదన లక్షలు గడించాడు. ఖూనీలు చేసే రకం వాడు."

"ఆః!" అన్నాను, మరీ అతిశయించి చెప్పవద్దన్నట్టుగా.

"ఏమిటి? వాడొక మర్డర్ కేసులో కూడా ఇన్వాల్వు కాలేదు. చూశావో లేదో!"

"దానికేమిటి? నేనూ కాలేదు!"

"డామిట్! వాడు చేసిన హత్యల్లో వాడిన్వాల్వు కాలేదన్నాను."

"డామిట్! నువ్వు చెప్పే మాటలు నా ఆలోచన రేపుతూన్నవి!....అయితే అతగాడి సంతానం?"

"వాడి ప్రైవేట్ లైఫ్ నన్ను అడక్కు. అది నాకే కాదు, కాకినాడ బస్తీలో ఎవరికీ తెలియదు. అయినా నువ్వడిగినంత వరకూ చెప్పగలను. ఒక ఆడపిల్లా, ఒక నెలల పిల్లాడూ ఉన్నారు. మధ్య ఒకరిద్దరు పిల్లలు పోయినట్టు జ్ఞాపకం."

"పిల్లకు పెళ్ళయిందా?"

"కాలేదు"

"ఎన్నేళ్ళుంటై?"

"ఉండవూ పదో ఎన్నో?"

"ఇంకా ఒకటి రొండేళ్లు—"

"ఎబ్బే! మా శశికే పదకొండో ఏడు రాలా!"

వాళ్ళ శశికి పదకొండో ఏడు రావటానికీ నాగభూషణం కూతురు సమర్తాడటానికీ కల సంబంధం నాకు సూర్యం అనుకున్నంత సులభంగా బోధపడకపోయినా, నాగభూషణం కూతురు రజస్వల కాలేదని నమ్మగలిగాను.

బెనర్జీని తీసుకుని సూర్యం వెళ్ళాడు వానకురిసి పోతున్న మబ్బుల్లె.

అంత వాడా నాగభూషణం? వాడి దగ్గిరికి విగ్ పెట్టుకు వెళ్ళినా తప్పు లేదు!

నేను కాకినాడ స్టేషను బయటికి అడుగు పెట్టానో లేదో, ఒక దీర్ఘ కాయుడైన పెద్దమనిషి నన్ను సమీపించి "తమరేనా శివరామయ్యగారు?" అని ఎంతో వినయ విధేయతలతో ప్రార్థించాడు.

"తమ రెవరు?"

"నేను నాగభూషణంగారి బావమరిదిని. వారి చెల్లెల్ని నాకిచ్చారు."

"బండికి వెళ్తారా?"

"లేదు లేదు! తమ కోసరమే వచ్చాను. పోదాం రండి. మన బండి సిద్ధంగా ఉంది!"

అనుమానించటం మొదలు పెట్టిన తరవాత అంతా అనుమానంగానే ఉంటుంది. నేను లేని నీడను చూసికూడా దడుసుకోటానికి సిద్ధంగా ఉన్నానుగా! అందుచేత ఈ వార్త వినగానే ఎవరో శివరామయ్య కెందుకో ఇంత గౌరవం అనుకున్నాను. ఒక్కటే ఉద్దేశం పొడకట్టింది. ఈ శివరామయ్య కాకినాడ పురవాసుల దగ్గిర్నించి ప్రైవేటుగా నాగభూషణం గారిని గురించి తెలుసుకోటం ఏ కారణం చేతో నాగభూషణంగారికి ఇష్టం లేదు. భేష్! ఏర్పాట్లన్నీ బందో బస్తుగానే ఉన్నై. నేను ఉత్తరం వ్రాయడం నాకే మేకయింది. రాయకపోతే అదో దుగ్ధగా ఉండేది. పెళ్ళి పిచ్చి సామెతయింది. కానీ ఇద్దరమూ బండిలో ఎక్కాం. బండిసాగింది.

"తమ నామధేయం?" అన్నాను.

"వెంకటేశ్వర్లు."

ఆయన వాలకం చూస్తే ఆయనకు నాతో సంభాషించాలని ఉన్నట్టు లేదు. నాకు మాట్టాడేందు కేమీ కనపళ్ళేదు.

ఆయన చాలా ఎత్తుగా, బక్క పలచగా, పచ్చగా, బీదగా, ఉన్నంతలో పూర్వ కాలపు సాంప్రదాయం కలవాడల్లే ఉన్నాడు. నేనెప్పు డాయన వంక తిరిగినా ఆయన నా వంకే చూస్తుండటాన్ని బట్టి ఆయనా నన్ను గురించి ఆలోచిస్తున్నాడేమో ననుకున్నాను.

బండి అకస్మాత్తుగా ఒక మలుపు తిరిగి ఆగిపోయింది. ఇద్దరమూ బండి దిగి ఎదురుగా వున్న ఇంటో ప్రవేశించాం. చుట్టూ చాలా ఎత్తయిన ప్రహరీ గోడలు— లోపల హత్యలు జరిగినా బయటివాడికి తెలియకుండా! లోపల రెండంతస్తుల మేడ. ఇల్లు కట్టినవాడు భోగి. డబ్బు ఖర్చుకు వెనుకాడేవాడుకాడు.

అల్లుడి కట్నం కింద అయిదువేలు విసిరి పారెయ్యగల ధీరుడే ననుకున్నాను, ఆ లివాసీలూ కుర్చీలూ మొదలైనవి చూసి.

నన్నొక గదిలో కూర్చోపెట్టి వెంకటేశ్వర్లుగారు మాటా పలుకూ లేకుండా లోపలికి వెళ్ళాడు. ఇంత సంపన్నుల ఇంటల్లుడింత దరిద్రుడెందు వల్ల అయినాడు? ఒకప్పుడు వెంకటేశ్వర్లుగారు కలవాడై ఉండవచ్చు. లేదా ఒకప్పుడు నాగభూషణం దరిద్రుడై ఉండవచ్చును.

ఇప్పుడు నా దగ్గిరికి నాగభూషణం వస్తాడు కాబోలు, గుర్తుపడితే, "నేనే వచ్చాను తెరిపి చేసుకుని అనగలను. గుర్తుపట్టకపోతే శివరామయ్యనే. గుర్తుపట్టి చెప్పకపోతే?— చావనీ! ... ఒకర్నొకరు నేలడీసుకోటమే జరిగితే నాగభూషణం ఒక ప్రశ్నకు నేను దజను వెయ్యగలను.

ఇంతలో ఒక పొట్టి నల్లటి గుంద్రటి మనిషి ఈ చెవునించి ఆ చెవుదాకా నవ్వుతూ నా దగ్గరికి వచ్చి ఒక కుర్చీలో కూచున్నాడు.

వెంకటేశ్వర్లు గారికి ప్రతిసృష్టల్లే కనపడ్డా డీయన. ఆయన పొడుగూ, ఈయన పొట్టీ. ఆయన తెలుపూ, ఈయన నలుపూ, ఆయన గాంభీర్యమూ, ఈయన ఇకిలింపూ— ఇంకెక్కడో లేడా బయట పడవలసి ఉందనుకుంటుండగా ఈయన లొడ లొడా వాగటం మొదలు పెట్టాడు.

"అయితే తమరు శివరామయ్యగారా? చిత్తం! మా అన్నగారు. చూశారా? తీరా తమరు విజయంచేసే సరికి గ్రామాంతరం వెళ్ళవలసి వచ్చింది. ఇందుకు వారు బహు నొచ్చుకున్నారు. కాని వారు లేని లోపం మిమ్మల్ని బాధింపరాదని మనవి చేస్తున్నాను. పెళ్ళికొడుకే వచ్చి పిల్లను చూసుకుంటే బాగుండేది. మేం కూడా పిల్లవాణ్ణి చూడ గలందులక్కాదు సుమండీ. మా కటువంటి పట్టింపులేదు. మరి కొంతమంది అలా అనుకోరు!"

వెధవ! నన్నెక్కిరించట మది.

"తమ నామధేయం?"

"హనుమంతరావు. మరి పిల్లను పిలిపించనా? బావగారూ! వెళ్ళి అమ్మాయిని తీసుకురండి."

గది బయట తారట్లాడుతున్న వెంకటేశ్వర్లుగారు లోపలికి వెళ్ళాడు. ఆయన వెళ్ళగానే హనుమంతరావు నన్ను గురించి అడగటం మొదలు పెట్టాడు. శివరామయ్యను గురించి నాకేమీ తెలేదు చెప్పటానికి! అంత వాగుడుగాణ్ని నే నెక్కడా చూళ్ళేదు. కాని ఆ వాగుడే నన్ను రక్షించింది. ఆ ప్రవాహంలో ఏ ప్రశ్నకు సమాధానం వస్తున్నదో దేనికి రావటం లేదో కూడా హనుమంతరావుకు పట్టలేదు.

వెంకటేశ్వర్లు పిల్లతో ప్రవేశించాడు.

ఆ పిల్లను చూడగానే నాలో కలిగిన మార్పు వర్ణనాతీతం. నేను సీరియస్‌గా పెళ్ళి చూపులకు వచ్చిన వాణ్ణయిపోయినాను. అంతవరకూ మనిషి వేషం ధరించి వచ్చిన నక్కల్లే కనపడుతున్న హనుమంతరావు నా కాబోయ్యే పిన మామగారైనాడు. నాగభూషణాన్ని గురించి లోకం చాలా దురభిప్రాయ పడుతున్నట్టు స్పష్టమయింది. ఈ గందరగోళంలో నా ప్రస్తుతపు పేరు శివరామయ్య అనే మాట ఎందుకు మరిచిపోలేదో నాకే తెలేదు.

"నీ పేరేమిటమ్మాయి?" అన్నాను.

"ఆ పిల్ల ఒక్క రవ్వ అనుమానించినట్టు కనబడి "సత్యవతి" అంది

"నువ్వేం చదువుకుంటున్నావు?"

"ఎనిమిదో క్లాసు" మళ్ళీ అదే అనుమానం.

"ఎక్కడ చదువుతున్నావు?"

ఈసారి సత్యవతి పినతండ్రి వంక చూస్తూ సమాధానమే చెప్పలేదు.

ఒక్క అరనిమిషం చూసి హనుమంతరావు 'ఎక్కడ చదువుకుంటున్నావో కూడా చెప్పలేవు చే, పిచ్చిదానా?" అన్నాడు.

"ఆడపిల్లల బళ్లో!" అంటూ సత్యవతి హనుమంతరావు వంక చురచురా చూసింది. చక్కనమ్మ నిక్కినా అందమే.

సెక్యూరిటీ అనేది మనుష్యులను ఎంత అజాగ్రత్తలో పడేస్తుందో వాళ్ళచేత ఎంత అవివేకమైన పన్లు చేయిస్తుందో అనేకమంది చూపారు. సత్యవతి నా భార్య అవుతుందనే నమ్మకం కలగగానే నా ఆలోచనా శక్తి నిద్రపోయింది. లేకపోతే నేనప్పుడే సందేహించి ఉండవలసింది - ఇంత కట్నంతో ఇంత చక్కని చుక్కను ఇచ్చెయ్య దలుచుకున్న తలలు మార్చగలవాడు నన్ను వెతుక్కుంటూ అంత దూరం ఎందుకు రావలిసొచ్చింది. ఇదంతా కాక పిల్ల వంటిన నాలుగైదువేల కిమ్మతు నగలూ రవ్వలూ కనిపిస్తున్నై. నాకా విమర్శే ఉంటే నా కనుకూలంగా కనపడ్డ ప్రతి విషయాన్ని గురించి నే ననుమానించి ఉండేవాణ్ణే.

ఇంతకూ సత్యవతిని చూడగానే నా మతిపోయింది. నే నింకో మనిషినై పోయినాను. నేను హనుమంతరావు వంక తిరిగి "ఇక చాల్లెండి. నేను వచ్చిన పని జయప్రదమైంది!" అన్నాను.

"పిల్ల ఎలా ఉంది?"

"బాగుంది. చేసుకోమని మా వాళ్ళకు గట్టిగా చెబుతాను"

"చిత్తం! చిత్తం!.... ఇక నువ్వు అమ్మ దగ్గిరికి పోవే, పిల్లా..... మళ్ళీ

నేను కొంచెం కార్యం గట్రా చూసుకో వెళ్ళాలి. తమరిలా పైకి వెళ్ళండి. చల్ల గాలి వస్తుంది.... బావగారూ, మన మిలా బజారుకు పోదామా?"

నేను హనుమంతరావు చూపించిన దారినే పై అంతస్తుకు వెళ్ళాను. అక్కడ ఒక విశాలమైన హాలుంది. ఒక ఉయ్యాల బల్లకూడా ఉంది. స్వతంత్రంగా నేను దానిమీద విశ్రమించాను.

అయిదు నిమిషాలైనా గడిచిందో లేదో మెట్లమీద చిరు చప్పుడయింది. కాస్సేపటికి సత్యవతి అక్కడికి వచ్చింది. ఆమె నన్ను చూసి మళ్ళీ దిగిపొయ్యే ప్రయత్నంలో ఉండటం చూసి ఆమెను పేరుపెట్టి పిలిచాను.

సత్యవతి మొహంలో కేవలం సౌందర్యమే కాక ఒక విధమైన తెలివితో కూడుకున్న కళా జంకుతనమూ ఉన్నై. ఆ రెండూ లేకపోతే అసలు సత్యవతి సామాన్యపు పిల్ల మాదిరిగానే ఉండేదేమో.

"ఆ పిల్ల నా దగ్గిరికి వచ్చి నిలబడ్డది.

"ఏం, సత్యవతీ? నువ్వు మరికాబొయ్యే మొగుణ్ని చూసుకున్నావా?"

"నన్నా పేరుపెట్టి ఎందుకు పిలుస్తారు?"

నేను నిర్ఘాంతపోయి "ఏం? నీ పేరు సత్యవతి కాదూ?" అన్నాను.

"కాదు నా పేరు సీత."

"అయితే సత్యవతి అని ఎందుకన్నావు ఇందాక?"

"అనకపోతే మా మామయ్య చంపుతాడని!"

"ఏబ్బే! వెంకటేశ్వర్లుగారు చాలా_"

"మా హనుమంతరావు మామయ్య. వెంకటేశ్వర్లుగారు మా నాన్న."

అప్పటికే నన్ను చాలా వరకు ఆవరించిన బుద్ధిమాంద్యం వల్ల నా కా పిల్ల మాటలు చప్పున అర్థం కాలేదు. కాని జరిగిన మోసం అర్థం కావటం మొదలు పెట్టిన తర్వాత చెప్పరాని ఆశ్చర్యం కలిగింది. అవును! అయిదువేలు చెప్పి ఏ వెయ్యో ముట్ట చెప్పటానికి నాగభూషణం ఏ నాన్న అమాయికత్వం ఆసరా చూసుకున్నాడో ఆ నాన్న అమాయకత్వమే ఆసరా చూసుకుని తన కూతుర్ని చూపించటానికి మారుగా తన చెల్లెలి కూతుర్ని చూపించాడు! ఎటుబోయి ఎటువచ్చినా తనమీదికేమీ రాకుండా, అన్నిటికీ ఉన్నాడుగా పాపాల భైరవుడు, హనుమంతరావు మీదికి నెట్టేందుకు వీలుగా తను తప్పుకొని తనస్థానే తమ్ముణ్ణి ఉంచాడు. ఇంతకూ సీత సహాయం లేకపోతే నేను వాళ్ళ వలలో పడవలసినవాణ్ణే. ఆ పిల్ల ధైర్యసాహసాలను వాళ్ళు సరిగా గ్రహించలేదు. అటువంటిది భార్యకావటం మగవాడికెంత అదృష్టమో నేనిప్పుడు బాగా తెలుసుకోగల స్థితిలోఉన్నాను.

"అయితే సత్యవతి అంత అనాకారి కోవా?"

"కాదు, పాపం, వెర్రిబాగులది, ఉత్తపిచ్చిది."

"మరి మీనాన్న ఈ ఏర్పాటు కెల్లా ఒప్పుకున్నాడు.

"మేం చాలా దరిద్రులం. మా నాన్న పెద్దమామయ్యకు చాలా బాకీ పడ్డాడు. ఆయన ఈ సహాయం చేస్తే అదంతా వదిలేసి నా పెళ్ళికూడా చేస్తానన్నాడు."

"ఎవరి కిచ్చి?"

"తన గుమాస్తా కిచ్చి?"

"చేసుకుంటావా?"

"నా యిష్టమా?"

నేను కాస్సేపు యోజించాను.

"నిన్ను మీ నాన్న మరొకరికి చేస్తే మీ మామయ్య తనకియ్యాలిసిన డబ్బుకోసం తొందర పెడతాడా?"

"ఏం తొందర పెట్టటానికైనా మానాన్న కేముంది? గర్భదరిద్రుడు."

"అయితే నీపెళ్ళి నేచేస్తాను, సీతా! ఇష్టపడతావా?"

"నాకేం తెలుస్తుంది? అటువంటివి తల్చుకుంటేనే నాకు భయం వేస్తుంది!"

సీతను చూసి జాలిపడ్డాను.

"నావంటివాణ్ణి చేసుకోటానికి భయమెందుకు? నాకు పెళ్ళికాలేదు. అసలు నాకే పెళ్ళి కావలసింది. ఇందులో ఏదో మోసం ఉందని అనుమానపడి మారు పేరుతో వచ్చాను. నిన్ను చూశాను నువ్వు నాకు నచ్చావు. నేను నిన్నే చేసుకుంటాను. ఏం?"

సీత ఏమి సమాధానం చెప్పలేదు. ఏం చెబుతుంది?

"రాత్రి బండికి బహుశా నావెంట మీ నాన్నగారు రావచ్చును. ఆయనతో అంతా మాట్లాడతాను. నీ కిష్టం లేకపోతే ఆయనతో చెబుతావా?"

"నే నాయనతో ఏమీ చెప్పను. మీతో మాట్లాడానంటే నన్ను మా మామయ్య బతకనివ్వడు."

సీతకు నన్ను చేసుకోటం ఇష్టమేనని ఎట్లాగైనా చెప్పిద్దామని పుట్టింది నాకు.

"అయితే, నన్ను చేసుకోటం నీకిష్టం ఉందీ లేందీ నాకు తెలేటం ఎట్లా?"

"అంతమాత్రం కనుక్కోలేని మందమతో?" అన్నట్టు సీత నావంక చూసి అకస్మాత్తుగా "మా చిన్నమామయ్య వచ్చినట్టుంది!" అంటూ కిందికి పరిగెత్తిపోయింది.

(ప్రథమ ముద్రణ : ఆగస్టు 1935, వినోదిని)